ప్రవేశిక

శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర
క్షైకారంభకు, భక్త పాలన కళాసంరంభకున్ దానవో
ద్రేక స్తంభకుఁ గేళిలోల విలసద్ దృగ్జాలసంభూత నా
నా కంజాత భవాండకుంభకు మహానందాంగనా డింభకున్. 1-1

పరమ భాగవతాగ్రేసరుడైన బమ్మెరపోతన్న గారు భాగవత మహాపురాణానికి శ్రీకారం చుట్టుతూ మనకు ప్రసాదించిన ప్రప్రథమ పద్యమిది. సంపూర్ణ భాగవతానికే అద్దం పడుతూ తెలుగు సాహిత్య సరస్వతికే మకుటాయమానమైన ఈ పద్య ప్రసూనంలో ఆరు దళాలు ఉన్నవి. "(1) శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ (2) లోక రక్షైకారంభకున్ (3) భక్త పాలన కళాసంరంభకున్ (4) దానవోద్రేక స్తంభకున్ (5) కేళిలోల విలసద్ దృగ్జాల సంభూత నానాకంజాత భవాండ కుంభకున్ (6) మహానందాంగనా డింభకున్" అనేవి అవి.

ఈ ఆరుదళాలూ భగవంతుని ప్రధాన గుణాలయిన సర్వేశ్వరత్వాన్నీ, ధర్మ సంస్థాపకత్వాన్నీ, శిష్టరక్షణ పరాయణత్వాన్నీ, దుష్టశిక్షణ చణత్వాన్నీ, విశ్వకర్తృత్వాన్నీ, ఆనందమయత్వాన్నీ క్రమంగా స్ఫురింపజేస్తున్నాయి.

చిత్తగించండి. "శ్రీ కైవల్యపదంబుఁ జేరుటకునై చింతించెదన్" అన్న ప్రథమదళం మోక్షంకోసం ఉత్కంఠితుడైన పరీక్షిన్మహారాజు వృత్తాంతంతో పాటు ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్థ స్కంధాలలోని, నారదుడు, భీష్మాచార్యుడు, కుంతీదేవి, ఖట్వాంగుడు, ఉద్ధవుడు, దేవహూతి, ధ్రువుడు మొదలైన వారి చరిత్రలను స్ఫురింపజేస్తూ భగవంతుని సర్వేశ్వరత్వాన్ని నిరూపించుతున్నది. ఎందుకంటే కైవల్యపదాన్ని అనుగ్రహించే అధికారం సర్వేశ్వరునికి మాత్రమే చెల్లుతుంది కనుక.

"లోకరక్షైకారంభకున్" అన్న ద్వితీయదళం తృతీయ సప్తమ స్కంధాల్లో హిరణ్యాక్ష హిరణ్యకశిపులను సంహరించి వారి అత్యాచారాలతో అస్తవ్యస్తమైన లోకాన్ని ఉద్ధరించిన భగవంతుని ధర్మసంస్థాపకత్వాన్ని వెల్లడిస్తుంది.

"భక్తపాలన కళాసంరంభకున్" అనే తృతీయదళం గజేంద్రుణ్ణి కాపాడటానికి శ్రీహరి వైకుంఠం నుంచి పరుగెత్తుకు రావటం, పరమ శివుడు ముల్లోకాలను రక్షించే నిమిత్తం హాలహలం త్రాగటం ఇత్యాది అష్టమస్కంధ కథలను ధ్వనింపజేస్తూ భగవంతుని శిష్టరక్షణ పరాయణత్వాన్ని చాటుతున్నది.

"దానవోద్రేక స్తంభకున్" అనే చతుర్థదళం వామనావతారానికి వ్యంజక మౌతున్నది. వచ్చే మన్వంతరంలో ఇంద్రుడు కావలసిన బలి చక్రవర్తి వరబలంతో ముందుగానే స్వర్గాన్ని ఆక్రమించి సింహాసన మెక్కి కూర్చున్నాడు. ఆ దానవేంద్రుని ఉద్రేకానికి పగ్గాలు పట్టి అతని విజృంభణాన్ని స్తంభింపజేసిన వృత్తాంతం భగవంతుని దుష్టశిక్షణ చణత్వాన్ని ప్రకటిస్తున్నది.

ఇక "కేళిలోల విలసద్ దృగ్జాల సంభూత నానాకంజాత భవాండ కుంభకున్" అన్న ఐదవదళం నవమస్కంధంలోని సూర్య చంద్ర వంశీయులైన రాజుల గాథలను అభివర్ణిస్తూ భగవంతుని విశ్వకర్తృకత్వాన్ని సూచిస్తున్నది. ఏమంటే స్వామి సవిలాసంగా త్రిప్పే నేత్రాలలో నుంచి బ్రహ్మాండ భాండాల సృష్టి జరుగుతుంది. వాస్తవానికి స్వామి నేత్రాలు సూర్య చంద్రులేగా!

" మహానందాంగనా డింభకున్" అనే ఆరవదళం శ్రీకృష్ణలీలా సర్వస్వమైన దశమస్కంధానికి ప్రతీక. ఆ నందాంగనకు ఆనందం అందిస్తూ ఆనందం అనుభవిస్తున్న ఆనందమయ స్వరూపుడు కదా ఆ నందనందనుడు!

పై విధంగా భాగవతాన్నంతా ప్రథమ పద్యంలోనే ప్రస్ఫురింపజేశాడు. మన మహాకవి పోతన్నగారు. ఆయన కవితా శిల్పానికి కైమోడ్పులు.

ఇప్పుడు మీ చేతులలో ఉన్న గ్రంథం నవమస్కంధం. ఇంతకు ముందు మనం చెప్పుకున్న ప్రకారం పరమపురుషుని నేత్రాలయిన సూర్యచంద్రుల వంశాలలో జన్మించిన మహాపురుషుల గాథలతో నిండిన నవమస్కంధం.

"పురాణం పంచలక్షణం"

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణి చ ।
వంశానుచరితం చేతి పురాణం పంచలక్షణమ్ ॥

"సర్గం" అంటే బ్రహ్మాండోత్పత్తి. "ప్రతిసర్గం" అంటే కల్పాంతాన పునస్సృష్టి. "వంశం" అంటే దేవర్షుల బ్రహ్మర్షుల దేవతల వంశ వర్ణనం. "మన్వంతరం" అంటే పదునల్గురు మనువుల పరిపాలన కాలం. "వంశానుచరితం" అంటే సూర్య చంద్ర వంశీయులైన మహారాజుల చరిత్రం.

పురాణానికి ఉండవలసిన ఈ ఐదు లక్షణాలలో మొదటి నాలుగూ ఇంతకు ముందు స్కంధాలలో అభివర్ణితము లైనాయి. ఇప్పుడు ఈ నవమస్కంధంలో ఐదవదైన "వంశానుచరితం". అంటే సూర్యచంద్ర వంశీయులైన రాజుల చరిత్రం అత్యంత మనోహరంగా అభివర్ణింపబడింది. పాఠకుల సౌకర్యంకోసం కొందరు ప్రధాన వ్యక్తులను పరిచయం చెయ్యటం ఆవశ్యకంగా భావిస్తాను.

సూర్యవంశం

పరమపురుషుని నాభిమధ్యం నుంచి బంగారుపద్మం ప్రభవించింది. ఆ సరోజంలో నుంచి చతుర్ముఖబ్రహ్మ జన్మించాడు. ఆ బ్రహ్మదేవుని కుమారుడు మరీచి మహర్షి. మరీచి పుత్రుడు కశ్యపుడు. కశ్యపుడు దక్షుని పుత్రిక అయిన అదితిని పెండ్లాడాడు. ఆ దంపతులకు సూర్యుడు ఉదయించాడు. సూర్యునికి 'సంజ్ఞ' అనే భార్య యందు 'శ్రాద్ధదేవు'డనే నామాంతరం గల వైవస్వతమనువు పుట్టాడు. ఈ మనువు భార్య శ్రద్ధ. ఈ దంపతులకు మొదట సుద్యుమ్నుడు, అనంతరం ఇక్ష్వాకుడు మొదలైన పది మంది పుత్రులు జన్మించారు. ఈ విధంగా సూర్యవంశం కొనసాగింది.

సుద్యుమ్నుడు

ఇతడు వైవస్వతమనువు ప్రథమ సంతానం. సంకల్పవైషమ్యం వల్ల ముందు ఇళా కన్యకగా జన్మించి వసిష్ఠుని తపఃప్రభావం వల్ల సుద్యుమ్నుడుగా మార్పుచెందాడు. స్త్రీరూపంలో ఇళా కన్యకగా ఉన్నప్పుడు చంద్రుని కుమారుడైన బుధునితో సంబంధం కలిగింది. ఈ దంపతులకు పురూరవుడు జన్మించాడు. సుద్యుమ్నుడు ఒకనాడు వేటకు పోయి కుమారవనంలో ప్రవేశించి మరల స్త్రీ (ఇళాకన్య) గా మారిపోయాడు. తరువాత పరమేశ్వరుని అనుగ్రహం వల్ల ఒక నెల స్త్రీగా, ఒకనెల పురుషునిగా మారుతూ చిరకాలం రాజ్యం పరిపాలించాడు.

శర్యాతి

ఇతడొక సుప్రసిద్ధుడైన సూర్యవంశపురాజు, వైవస్వత మనువు పదిమంది బిడ్డలలో ఒకడు. ఈతని కొమార్తె సుకన్యకు చ్యవన మహర్షితో వివాహం జరిగింది. చ్యవనమహర్షి దేవవైద్యులైన అశ్వినీ దేవతలకు యజ్ఞాలలో హవిర్భాగం కల్పించి వారి వల్ల తాను నవయౌవనం పొందాడు.

అంబరీషుడు

సూర్యవంశపు రాజులలో పేరెన్నిక గన్నవాడు. వైవస్వతుని మనుమడైన నాభాగుని కుమారుడు మహాభక్తుడు. విష్ణుదేవుని ఆరాధన యందు ఆసక్తుడు. ఒకనాడు ఉపవాసానంతరం ద్వాదశిపారణ సందర్భంలో దుర్వాసుణ్ణి భోజనానికి ఆహ్వానించాడు. దుర్వాసుడు నదిలో స్నానం చేయటానికి పోయి ఎంత సేపటికి తిరిగిరాడు. పారాయణ సమయం గడిచిపోతున్నది. అంబరీషుడు అభిజ్ఞుల అభిప్రాయాన్ని అనుసరించి జలపారణం చేశాడు. ఆ సంగతి తెలుసుకొని దుర్వాసుడు మండి పడి అహంకారంతో హుంకరించి అంబరీషుని మీద మహాకృత్యను ప్రయోగించాడు. తన భక్తుడైన అంబరీషుని రక్షించే నిమిత్తం శ్రీ హరి సుదర్శన చక్రాన్ని పంపించాడు. సుదర్శనం కృత్యను భస్మంచేసి దురహంకారి అయిన దుర్వాసుని వెంట పడింది. దుర్వాసుడు భయంతో పరువెత్తి ముల్లోకాలూ తిరిగి చివరకు శ్రీహరి ఆజ్ఞానుసారం మహాభక్తుడైన అంబరీషుడి పాదాల మీదపడి ప్రార్థించాడు. ఆయన అనుగ్రహం వల్ల చక్రానలజ్వాలల నుంచి విముక్తుడైనాడు.

ఇక్ష్వాకుడు

మనువు పదిమంది కుమారులలో పెద్దవాడు. సూర్యవంశానికి మణిమకుటం వంటి మహారాజు. ఈ మహాపురుషుని పేరు మీదుగానే శ్రీరాముడు "ఇక్ష్వాకు కులతిలకు" డన్న విఖ్యాతి నందుకొన్నాడు.

కకుత్స్థుడు.

ఇతడు ఇక్ష్వాకుని పౌత్రుడు. ఇతనికి "పురంజయుడు" అనే నామాంతర మున్నది. ఈ మహనీయుడు దేవదానవ యుద్ధంలో వృషభరూపం ధరించిన దేవేంద్రుని మూపురం మీద కూర్చుండి రాక్షస సంహారం చేసి దేవతలకు సంతోషం చేకూర్చాడు. "కకుత్" అంటే ఆబోతు మూపురం. అందువల్లనే "కకుత్స్థుడు"

అనే పౌరుషనామం ఇతని పట్ల సార్థకమయింది. ఈ వీరుని పేరు మీదుగా శ్రీరాముడు "కకుత్స్థవంశ కలశాంబుధిసోముడు" అయినాడు.

మాంధాత

ఈతడు కకుత్స్థునికి 16 వ తరంవాడు. వీరాధివీరుడు, రావణుని వంటి మహాబలశాలిని సైతం గడగడ లాడించి "త్రసదస్యుడు" అనే బిరుదు వహించాడు. శతబిందుని పుత్రిక అయిన బిందుమతి యందు ముగ్గురు పుత్రులను, ఏబదిమంది పుత్రికలను కన్నాడు. అందగత్తెలైన ఈ ఏబదిమందినీ "సౌభరి" అనే మహర్షి వివాహమాడాడు.

పురుకుత్సుడు

ఇతడు మాంధాత పెద్దకుమారుడు. నాగలోకంలో గర్వాంధులైన గంధర్వనాయకులను సంహరించి నాగులమెప్పు పొందాడు. "నర్మద" అనే నాగకన్యను వివాహమాడాడు. నర్మదా పురుకుత్సుల దాంపత్యం చరిత్ర ప్రసిద్ధం. పురుకుత్సుడు షట్చక్రవర్తులలో ఒకడుగా పేరెన్నిక గన్నాడు.

త్రిశంకుడు

ఇతడు పురుకుత్సునికి ఏడవతరం వాడు. బొందితోకూడా స్వర్గానికి పోవాలని ప్రయత్నించి చివరకు విశ్వామిత్రుని అనుగ్రహం వల్ల త్రిశంకుడు స్వర్గంలో స్థిరపడినాడు. సుప్రసిద్ధుడైన హరిశ్చంద్రునికి కన్న తండ్రి.

హరిశ్చంద్రుడు

ఈయన షట్చక్రవర్తులలో ప్రధానుడు. సుప్రసిద్ధుడైన సూర్యవంశపు రాజు. తన సత్యనిష్ఠవల్ల విశ్వామిత్రుని ప్రశంస లందుకొన్నాడు. ఈయన యజ్ఞంలో సంతుష్టుడైన దేవేంద్రుడు ఈయనకు కనకరథాన్ని బహూకరించాడు.

సగరుడు

హరిశ్చంద్రునికి ఎనిమిదవ తరంవాడు షట్చక్రవర్తులలో ఒకడు. ఇతని తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు చూడలేని సవతి తల్లులు ఆమెకు విషం పెట్టారు. ఐనా ఏ మాత్రం చెక్కుచెదరకుండా గరళంతో పాటు జన్మించినందువల్ల ఇతనికి 'సగరుడు' అనే పేరు వచ్చింది. ఈ మహావీరుడు శకులను, యవనులను, హైహయులను, బర్బరులను జయించినాడు. ఇతని కుమారులు త్రవ్వటం చేతనే సముద్రానికి 'సాగర'మనే పేరు వచ్చింది. సగరుని అశ్వమేధయాగంలో యజ్ఞాశ్వాన్ని దేవేంద్రుడు అపహరించి పాతాళలోకంలోని కపిలమహర్షి ఆశ్రమంలో కట్టివేసి వెళ్లిపోయాడు. అశ్వాన్ని అన్వేషింప వచ్చిన సగరనందనులు మహర్షిని అనుమానించి అవమానించి ఆ మహర్షి కన్నులు తెరవగానే అంతా భస్మమై పోయారు. తరువాత సగరుని

మనుమడైన అంశుమంతుడు తన వినయవినమ్రతల వల్ల కపిలమహర్షి అనుగ్రహాన్ని సంపాదించి అశ్వాన్ని కొనివచ్చి తాతగారి యజ్ఞం పూర్తి చేయించాడు.

భగీరథుడు

ఇతడు సగర చక్రవర్తి మనుమడైన అంశుమంతుని మనుమడు. ఘోరమైన తపస్సు చేసి సదాశివుని మెప్పించి దివిజగంగను భువికి రప్పించి తన పితామహుల భస్మరాసులపై ప్రవహింపచేశాడు. వారికి పుణ్యలోకాలు ప్రాప్తింపచేశాడు. ఇతని పేరు మీదుగానే గంగకు "భాగీరథి" అనే నామం వచ్చింది. "దృఢమైన సంకల్పం అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేస్తుంది" అన్న నీతికి భగీరథుని వృత్తాంతం చక్కని ఉదాహరణం.

ఋతుపర్ణుడు

ఇతడు భగీరథునికి ఐదవతరం వాడు. షట్చక్రవర్తులలో ఒకడైన నలునికి ప్రియమిత్రుడు. ఇతడు నలునికి అక్షవిద్యారహస్యం బోధించి ఆయన నుంచి అశ్వవిద్యావిశేషం గ్రహించాడు.

ఖట్వాంగుడు

ఈయన భగీరథునికి పదకొండవ తరంవాడు. రణరంగంలో రాక్షసులను సంహరించి అమరులకు విజయం చేకూర్చిన పరాక్రమశాలి. దేవతల వల్ల తన ఆయుశ్శేషాన్ని తెలుసుకొని సమస్త రాజ్యభోగాలూ పరిత్యజించి విరక్తుడై విష్ణుసాయుజ్యం పొందిన వివేకవంతుడు.

రఘుమహారాజు

ఈయన ఖట్వాంగుని మనుమడు. రవి వంశానికి "రఘువంశ" మనే ప్రసిద్ధి చేకూర్చిన మహావీరుడు. భారతభూమిని ఏకచ్ఛత్రంగా పరిపాలించిన మహాప్రభువు. ఈయన వల్లనే శ్రీరాముడు 'రఘురాము' డైనాడు.

దశరథుడు

ఈయన రఘుమహారాజు మనుమడు. అజమహారాజు పుత్రుడు. దేవాసుర సంగ్రామంలో ఇంద్రుని పక్షం వహించి పోరాడిన వీరశిరోమణి, సత్యసంధుడు. అవతార పురుషుడైన శ్రీరామచంద్రుని కన్న తండ్రి.

శ్రీరాముడు

రామాయణ కథానాయకుడు. సీతావల్లభుడు. రావణగర్వనిర్వాపణుడు. దశరథుని నలుగురు పుత్రులలో జ్యేష్ఠుడు. శ్రీరామునికి కుశలవులూ, లక్ష్మణునికి అంగద చంద్రకేతులూ, భరతునికి దక్షపుష్కలులూ, శత్రుఘ్నునికి సుబాహు శ్రుతసేనులూ సంభవించి సూర్యవంశాన్ని మూడు పూలూ ఆరు కాయలుగా విస్తరింపచేశారు.

చంద్రవంశం

సహస్రశీర్షుడైన జగన్నాథుని నాభికమలంలో నుంచి బ్రహ్మ ప్రాదుర్భవించాడు. బ్రహ్మకు అత్రిమహర్షి ఆవిర్భవించాడు. అత్రిమునీంద్రుని కడగంటి చూపులలో నుంచి కలువల చెలికాడు చంద్రు డుదయించాడు. చంద్రుడు బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారం తారామండలానికీ, ఓషధులకూ అధినాథుడైనాడు. రాజసూయం చేసి త్రిలోకవిజయం సాధించాడు. చంద్రుడు మూలపురుషుడుగా చంద్రవంశం కొనసాగింది.

బుధుడు

ఇతడు తారాచంద్రుల గారాబు బిడ్డ. బుద్ధిమంతుడైన బుధుడు మనుపుత్రి అయిన ఇళా కన్యను వరించాడు. ఈ దంపతులకు పురూరవుడనే కుమారుడు జన్మించి చక్రవర్తిగా పేరెన్నిక గన్నాడు.

పురూరవుడు

పురూరవుని శౌర్యధైర్య సౌందర్య గాంభీర్యాది గుణాలకు ఆకర్షితురాలైన ఊర్వశి అతనిని వరించింది ఊర్వశీ పురూరవులకు "ఆయువు" మొదలైన ఆరుగురు పుత్రులు జన్మించారు. వారిలో ఆయువుకు నహుషుడు ఉద్భవించాడు.

నహుషుడు

ఇతడు నూరు యజ్ఞాలు చేసి దేవేంద్రపదవిని అధిష్ఠించాడు. ఆ అహంకారంతో అధికార గర్వంతో ఇంద్రపత్ని అయిన శచీదేవిని తన దానినిగా చేసుకోవాలని ఆకాంక్షించాడు. అందుకోసం అట్టహాసంగా మహర్షులు మోస్తున్న పల్లకీ ఎక్కి బయలుదేరాడు. పల్లకీ సరిగా మోయటం లేదని అగస్త్యుణ్ణి అధిక్షేపించి ఆ మహర్షి ఆగ్రహానికి గురియై అజగరంగా మారిపోయాడు. పూజ్యపూజావ్యతిక్రమం ఎంతటి అనర్థాన్ని కలిగిస్తుందో ఈ కథ మనకు తెలుపుతుంది.

విశ్వామిత్రుడు

ఇతడు పురూరవునికి పన్నెండవ తరం వాడైన గాధిరాజు కుమారుడు. వసిష్ఠునితో వైరం పెంచుకొని రాజ్యాన్ని త్యజించి ఘోరమైన తపస్సు చేసి తాను కూడా "బ్రహ్మర్షి" అనిపించుకున్నాడు. పట్టుదల ఉంటే సాధ్యం కానిదేమీ ఉండదని ఈయన చరిత్ర మనకు బోధిస్తుంది.

యయాతి

ఇతడు నహుషుని కుమారుడు. అసురగురువైన శుక్రుని తనూజ దేవయానినీ, అసురరాజైన వృషపర్వుని పుత్రిక శర్మిష్ఠనూ వివాహమాడాడు. సప్తద్వీప సమన్వితమైన వసుమతీ చక్రాన్ని అవక్రపరాక్రమంతో పరిపాలించాడు. దేవయానికి యదువు, తుర్వసుడు అనే ఇద్దరు కొడుకులు జన్మించారు. శర్మిష్ఠకు ద్రుహ్యుడు, అనువు, పూరుడు అనే ముగ్గురు పుత్రులు పుట్టారు.

పూరుడు

ఇతడు యయాతి చిన్నకొడుకు. పేరెన్నిక గన్న పితృభక్తుడు. తండ్రి వార్ధక్యాన్ని తాను గ్రహించి తన యౌవనాన్ని తండ్రికి ధారపోసిన త్యాగధనుడు.

దుష్యంతుడు

ఈ మహారాజు పూరునకు పదునాల్గవతరం వాడు. చతుస్సముద్ర ముద్రితమైన మహీమండలాన్ని పరిపాలించిన మహావీరుడు. వేట నిమిత్తం అడవికి పోయి అక్కడ కణ్వాశ్రమంలో మేనకా విశ్వామిత్రుల పుత్రిక అయిన శకుంతలను చూచి ప్రేమించి గాంధర్వ వివాహం చేసుకున్నాడు.

భరతుడు

ఇతడు శకుంతలా దుష్యంతుల కుమారుడు. తండ్రిని మించిన తనయుడై సమస్త భూమండలాన్నీ జనరంజకంగా పాలించాడు. యమునాతీరంలో డెబ్బై ఎనిమిదీ, గంగాతీరంలో ఏభై ఐదూ మొత్తం నూటముప్పై మూడు అశ్వమేధయాగాలు చేశాడు. శక శబర బర్బర కిరాత హూణ మ్లేచ్ఛరాజులను జయించాడు. రసాతలంలో రాక్షసరాజుల కారాగృహాలలో ఉన్న దేవతాస్త్రీలను విడిపించాడు. ఈయన చల్లని పరిపాలనలో భూమ్యాకాశాలు ప్రజలపాలిటి కల్పవృక్షాలై వారి కోరికలు తీర్చాయి.

రంతిదేవుడు.

ఈయన భరతునకు ఐదవతరం వాడు. ఈ మహారాజు తన సర్వ సంపదలనూ బీదసాదలకు పంచిపెట్టి నలభై ఎనిమిది రోజులు నిరాహారుడై ఉన్నాడు. ఆనాడు తినబోతున్న అన్నాన్ని సైతం ఆగంతుకులైన అభ్యాగతులకు అర్పించి మిగిలి ఉన్న నీళ్లు త్రాగబోతున్నాడు. ఆ సమయంలో ఒక చండాలుడు దాహార్తుడై రాగా తన దగ్గర ఉన్న ఆ జలాలను సైతం వానికి సమర్పించిన త్యాగమూర్తి. బ్రహ్మాది దేవతల అనుగ్రహానికి పాత్రుడైన పవిత్ర చరిత్రుడు.

హస్తి

ఇతడు భరతుని మనుమడైన బృహత్క్షత్రుని మనుమడు. తన పేరు మీదుగా హస్తినాపురం నిర్మించి ప్రశస్తి గాంచిన యశోధనుడు.

సంవరణుడు

ఇతడు హస్తిరాజు కుమారుడైన అజమీఢుని పౌత్రుడు. సూర్యనందన అయిన తపతిని ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. తపతీసంవరణుల దాంపత్యం జగత్ప్రసిద్ధం.

కురువు

ఇతడు తపతీ సంవరణుల కుమారుడు. ఇతని పేరు మీదుగానే "కురుక్షేత్రం'' వెలసింది. ఈయన వల్లనే "కురువంశ'' మనే పేరు వాడుకలోనికి వచ్చింది.

శంతనుడు

కురువుకు పదమూడవ తరంవాడు. కౌరవ పాండవులకు మూల పురుషుడు. ఈ మహారాజుకు గంగాదేవి యందు భీష్ముడూ, దాశరాజుపుత్రి అయిన సత్యవతి యందు చిత్రాంగద విచిత్ర వీర్యులూ జన్మించారు. సత్యవతికి కన్యాప్రాయంలో పరాశర మునీంద్రుని అనుగ్రహంవల్ల వేదవ్యాసమహర్షి ఉదయించాడు.

విచిత్రవీర్యుడు

శంతనుని చిన్నకొడుకు. ఇతడు కాశీరాజు పుత్రికలైన అంబికను అంబాలికను వివాహమాడాడు. వ్యాసభగవానుని అనుగ్రహం వల్ల అంబికకు ధృతరాష్ట్రుడూ, అంబాలికకు పాండురాజూ జన్మించారు.

ధృతరాష్ట్రుడు

గాంధార రాజపుత్రి అయిన గాంధారిని వివాహమాడాడు. ఈ దంపతులకు దుర్యోధనాదులు వందమంది పుత్రులు, దుశ్శల అనే పుత్రిక కలిగారు.

పాండురాజు

ఈయన "కుంతి" అనే నామాంతరం కల వసుదేవుని సోదరి పృథను, మద్రదేశాధీశ్వరుని పుత్రి మాద్రినీ వివాహమాడాడు. కుంతికి ధర్మజ భీమార్జునులూ, మాద్రికి నకులసహదేవులూ ఉదయించారు.

అర్జునుడు

పాండుపుత్రులలో తృతీయుడు; పరాక్రమంలో అద్వితీయుడు. శ్రీకృష్ణసోదరి అయిన సుభద్రను వివాహమాడాడు. ఈ దంపతులకు అభిమన్యుడు జన్మించాడు.

పరీక్షిత్తు

ఉత్తరాభిమన్యుల నందనుడు. ఈతడే మహాభాగవత శ్రోత.

జనమేజయుడు

పరీక్షిత్తు కుమారుడు. ఈతడు మహాభారత శ్రోత.

కార్తవీర్యార్జునుడు

యయాతి కుమారుడైన యదువునకు పదవ తరంవాడైన కృతవీర్యుని కుమారుడు. సప్తద్వీపవతి అయిన వసుమతిని పరిపాలించాడు. దత్తాత్రేయుని ప్రియశిష్యుడై యోగవిద్య నభ్యసించాడు.

ఆహుకుడు

ఈతడు యదువంశీయులలో నలభై నాల్గవ తరంవాడు. దేవకుడు, ఉగ్రసేనుడు అనేవారు ఈయన కుమారులు.

దేవకుడు

ఈయనకు "దేవకి" మొదలైనవారు ఏడుగురు పుత్రికలు జన్మించారు. వీరందరినీ వసుదేవుడు వివాహమాడాడు.

ఉగ్రసేనుడు

ఈయన అహుకుని రెండవ కుమారుడు. మధురానగరాధీశుడు. కంసుడు మొదలైన వారు తొమ్మిదిమంది ఈయన కుమారులు.

శూరసేనుడు

ఈతడు యదువంశీయులలో ముప్ఫైనాల్గవ తరంవాడైన సాత్వతునికి పన్నెండవ తరంవాడు. ఈయన భార్యపేరు మారిష. ఈ దంపతులకు వసుదేవుడు మొదలైన పదిమంది పుత్రులూ, కుంతి మొదలైన ఐదుగురు పుత్రికలూ జన్మించారు.

వసుదేవుడు

శూరసేనుని జ్యేష్ఠపుత్రుడు. దేవకుని పుత్రికలైన "దేవకి" మొదలైన ఏడుగురను పెండ్లాడాడు. ఈయన జన్మించినప్పుడు ఆకాశాన దేవదుందుభులు మ్రోగాయి. అది కారణంగా వసుదేవునికి "ఆనక దుందుభి" అనే పేరు వచ్చింది. ఈ పుణ్యపురుషునికి రోహిణి యందు బలరాముడు, గదుడు, సారణుడు అనే కుమారులు కలిగారు. దేవకి యందు దేవదేవుడైన శ్రీకృష్ణభగవానుడు ఆవిర్భవించాడు. అనంతరం శ్రీకృష్ణుని ముద్దుల చెల్లె సుభద్ర జన్మించింది.

వసుదేవుని చెల్లెండ్రలో "పృథను" పాండురాజు పెండ్లాడాడు. వీరి పుత్రులు పాండవులు.

"శ్రుతదేవ" ను కరూషదేశాధిపతి వృద్ధశర్మ వివాహం చేసుకొన్నాడు. వీరికి దంతవక్త్రుడు పుట్టాడు.

"శ్రుతకీర్తి" ని కేకయవంశీయుడు ధృష్టకేతువు వివాహమాడాడు. వీరికి ప్రతర్దనుడు మొదలైనవారు జన్మించారు.

"శ్రుత శ్రవస"ను చేది దేశపురాజు దమఘోషుడు పెండ్లాడాడు. వీరికి శిశుపాలుడు పుట్టాడు.

"రాజాధిదేవి" ని జయసేనుడు పరిణయమాడాడు. వీరికి విందానువిందులు జన్మించారు.

వీరందరూ చంద్రవంశపువారే. అయినప్పటికీ యయాతి పుత్రుడైన యదువు పేరుమీద యదువంశీయులుగా ప్రసిద్ధి గాంచారు.

సూర్యవంశంలో శ్రీరామచంద్రుడు ఉదయించాడు. చంద్రవంశంలో శ్రీకృష్ణభగవానుడు ఉద్భవించాడు. ఈ విధంగా ఇద్దరు అవతార పురుషులకు మూలభూతాలైన సూర్యచంద్రవంశాలు ఈ నవమస్కంధంలో అత్యంత మనోహరంగా అభివర్ణితములైనాయి. అదీగాక-

హరిశ్చంద్రో నలో రాజా పురుకుత్సః పురూరవః।
సగరః కార్తవీర్యశ్చ షడేతే చక్రవర్తినః॥

ఆరుగురు చక్రవర్తులలో హరిశ్చంద్రుడు, పురుకుత్సుడు, సగరుడు- ఈ ముగ్గురూ సూర్యవంశీయులు. నలుడు, పురూరవుడు, కార్త వీర్యార్జునుడు- ఈ ముగ్గురూ చంద్రవంశానికి చెందినవారు.

ఈ స్కంధంలో సుద్యుమ్నుని వృత్తాంతం, సుకన్యాచరిత్రం, అంబరీషోపాఖ్యానం గంగావతరణం, శ్రీరామచరిత్రం, ఊర్వశీ పురూరవం, పరశురామ పరాక్రమం, యయాతి చరిత్రం, శకుంతలా దుష్యంతుల ఉదంతం, ఋశ్యశృంగ చరిత్రం మొదలైన ఘట్టాలను ఎంతో రమ్యంగా రసవంతంగా పోతన్న గారు తీర్చిదిద్దారు.

అందులో తనకు అభిమానపాత్రమైన శ్రీరామచరిత్రాన్ని అందమయిన అనుప్రాసలతో అంత్యప్రాసలతో అలంకరించి తన కవితాశక్తినీ, రామభక్తి నీ వ్యక్తీకరించారు పోతన్నగారు.

శ్రీరామచంద్రుడు వనవాసానికి బయల్దేరాడు. అదుగో- దండకారణ్యం ఎంత దర్శనీయంగా ఉన్నదో చూడండి.

పుణ్యుడు రామచంద్రుఁడటవోయి ముదంబునఁ గాంచె దండకా
రణ్యముఁ దాపసోత్తమ శరణ్యము నుద్ధత బర్హిబర్హ లా
వణ్యము గౌతమీవిమల వాఃకణపర్యటన ప్రభూత సా
ద్గుణ్యము నుల్లసత్తరు నికుంజ వరేణ్యము నగ్రగణ్యమున్. **9-268**

శ్రీరాముడు పరాక్రమశాలి అయిన వాలిని నేలకూల్చిన ఘట్టం తిలకించండి-

లీలన్ రామవిభుండొక, కోలన్ గూలంగ నేసె గురునయశాలిన్
శీలిన్ సేవితశూలిన్, మాలిన్ వాలిన్ దశాస్యమానోన్మాలిన్. **9-273**

పగవాని తమ్మునికి పట్టాభిషేకం చేసిన శ్రీరాముని ఔదార్యాన్ని ఈ క్రింది పద్యంలో సందర్శించవచ్చు-

శోషితదానవుండు నృపసోముఁడు రాముఁడు రాక్షసేంద్రతా
శేషవిభూతిఁ గల్పసమజీవిని గమ్మని నిల్పె నర్థి సం
తోషణుఁ బాపశోషణు నదూషణు శశ్వదరోషణున్ మితా
భాషణు నార్యతోషణుఁ గృపాగుణభూషణు నవ్విభీషణున్. **9-312**

సీతాసమేతుడై అయోధ్యకు తిరిగి వచ్చిన శ్రీరామచంద్రుణ్ణి పురకాంతలు సౌధాగ్రాలపై నుంచి దర్శించిన తీరు సుమనో మనోహరంగా ఉన్నది.

ఇతఁడే రామనరేంద్రుఁ; డీయబల కా యింద్రారి ఖండించె! న
ల్లతఁడే లక్ష్మణుఁ; డాతఁడే కపివరుం! డా పొంతవాఁడే మరు
త్సుతుఁ; డా చెంగట నా విభీషణుఁ; డటంచుం జేతులం జూపుచున్
సతులెల్లం బరికించి చూచిరి పురీసౌధాగ్ర భాగంబులన్. 9-325

రామకథను రసవంతంగా గానం చేస్తున్న కుశలవులను శ్రీరామచంద్రుడు ప్రశ్నించిన విధం ఎంతో సహజంగా ఉన్నది.

చిన్ని యన్నలార! శీతాంశుముఖులార!, నళినదళవిశాల నయనులార!
మధురభాషులార! మహిమీఁద నెవ్వరు, దల్లి దండ్రి మీకు ధన్యులార! 9-353

పోతన్నగారు శివుడిలో శ్రీరాముణ్ణి చూడగలరు. శ్రీరాముడిలో శ్రీకృష్ణుణ్ణి చూడగలరు. ఆయనకు కృష్ణుడంటే ఎంత ఇష్టమో రాముడన్నా అంతే ఇష్టం. అందువల్లనే దశమస్కంధంలో శ్రీకృష్ణుణ్ణి వర్ణిస్తూ వ్రాసిన "నల్లనివాడు పద్మనయనంబులవాడు" అన్న పద్యం వంటి పద్యాన్ని నవమస్కంధంలో అదే ఛందంలో అదే ప్రాసలో రచించి శ్రీరాముని కంఠంలో అలంకరించారు. ఎన్నటికీ వాడనిదీ సౌరభం వీడనిదీ అయిన ఆ ఉత్పలమాలను చిత్తగించండి-

నల్లనివాఁడు, పద్మనయనంబులవాఁడు, మహాశుగంబులన్
విల్లును దాల్చువాఁడు, గడువిప్పగు వక్షమువాఁడు, మేలు పైఁ
జల్లెడువాఁడు, నిక్కిన భుజంబులవాఁడు, యశంబు దిక్కులం
జల్లెడు వాఁడు నైన రఘుసత్తముఁ డీవుత మా కభీష్టముల్! 9-361

సీతారాముల ప్రణయమయ జీవితానికి అద్దం పట్టుతూ ముద్దులు మూటగట్టుతూ ఉన్న ఈ క్రింది పద్యం పోతన్నగారి అనువాద సౌభాగ్యానికి అచ్చమైన మచ్చుతునక-

మూలం: **ప్రేమ్ణానువృత్త్యా శీలేన ప్రశ్రయావనతా సతీ।**
భియా హ్రియా చ భావజ్ఞా భర్తుః సీతాహరన్మనః॥

దీనికి పోతన్న గారి అనువాదం-

సిగ్గుపడుట గల్గి సింగారమును గల్గి
భక్తి గల్గి చాల భయము గల్గి
నయము ప్రియము గల్గి నరనాథు చిత్తంబు
సీత తనకు వశము చేసికొనియె. 9-338

ఇది ఎంత చిన్న పద్యమో అంత గొప్పపద్యం. ఈ పద్యం ఎంత సునాయాసంగా పాఠకుని హృదయాన్ని ఆకర్షించు కుంటున్నదో అంత సులభంగా సున్నితంగా సీత శ్రీరాముని హృదయాన్ని వశంచేసుకున్నదని ఇందలి పరమార్థం.

అశ్వాన్ని అన్వేషిస్తూ తన ఆశ్రమానికి అరుదెంచిన అంశుమంతుని వినయవిధేయతలకు మెచ్చి కపిలమహర్షి ఇలా అంటాడు-

అశ్వోఽయం నీయతాం వత్స! పితామహ పశుస్తవ।

ఇమే చ పితరో దగ్ధా గంగా భోఽర్హంతి నేతరత్ ॥

మూలంలోని ఈ శ్లోకాన్ని పోతన్నగారు ఇలా అనువదించారు-

గుఱ్ఱము గొనిపో ముద్దుల, కుఱ్ఱడ! నీ తాత యొద్దకున్; నీ తండ్రుల్

వెఱ్ఱులు, నీఱైె రదె! యీ, మిఱ్ఱున గంగాజలంబు మెలఁగ శుభ మగున్. 9-215

"ముద్దుల కుఱ్ఱఁడ!" అనటంలో కపిలమహర్షికి అంశుమంతునిపై కలిగిన అపార వాత్సల్యం వెల్లడి అవుతున్నది.

భయంతో పరుగెత్తుతున్న దుర్వాసుని వెంటపడి తరుముతున్న సుదర్శనాన్ని దర్శించండి.

భువి దూఱన్ భువి దూఱు; నబ్ధిఁ జొర నబ్ధుల్ సొచ్చు; నుద్వేగియై

దివిఁ బ్రాఁకన్ దివిఁ బ్రాఁకు;దిక్కులకుఁబో దిగ్వీథులం బోవుఁ; జి

క్కి వెసన్ గ్రుంగినఁ గ్రుంగు; నిల్వ నిలుచున్; గేడింపఁ గేడించు; నొ

క్క వడిన్ దాపసు వెంటనంటి హరిచక్రం బన్యదుర్వక్రమై!! 9-107

యయాతి చేయూత నిచ్చి నూతిలో నుంచి దేవయానిని ఉద్ధరించిన సందర్భం పురస్కరించుకొని భారతం ఆదిపర్వంలో నన్నయ్యగారు ఇలా వ్రాశారు.

జలధి విలోలవీచి విలసత్కలకాంచి సమంచితావనీ

తల వహనక్షమం బయిన దక్షిణహస్తమునం దదున్నమ

ద్గళదురు ఘర్మవారికణ కమ్రకరాబ్జము పట్టి నూతిలో

వెలువడఁ గోమలిం దిగిచె విశ్రుతకీర్తి యయాతి ప్రీతితోన్.

ఇందలి అక్షరరమ్యతకూ, సమాససౌందర్యానికీ చేతులెత్తి నమస్కరిద్దాము. ఇదే సందర్భాన్ని పురస్కరించుకొని పోతన్నగారు భాగవతం నవమస్కంధంలో ఈ క్రింది పద్యం రచించారు.

సప్తాంభోనిధి మేఖలావృత మహాసర్వంసహా కన్యకా

ప్రాప్తోద్యద్వర దక్షదక్షిణకర ప్రాలంబముంజేసి ప్రో

క్షిప్తం జేసె యయాతి కట్టుకొనఁ బై చేలంబు మున్నిచ్చి ప

ర్యాప్త స్వేదజలాంగి నాళిసముదాయ స్వర్గవిన్ భార్గవిన్. 9-527

పోతన్నగారు నన్నయ్యగారి పద్యాన్ని మనస్సులో పెట్టుకునే ఈ పద్యం వ్రాశారనటంలో సందేహం లేదు. వస్త్రవిహీనయై నూతిలో పడి ఉన్న దేవయానిని పైకి లాగటం కోసం చాపిన యయాతి దక్షిణ హస్తాన్ని మహాకవు లిద్దరూ ఇంచుమించుగా ఒకే విధంగా వర్ణించారు. రెండు పద్యాలలో గట్టి పట్టు ఉన్నది. బిగువు ఉన్నది. ముగింపు కూడా రెండు పద్యాలలోనూ బాగ కుదిరింది. అయితే "కట్టుకొన పై చేలంబు మున్నిచ్చిన" భాగవత యయాతిలో భారత యయాతిలో కంటే కొంత ఔచిత్యం ఉన్నదనక తప్పదు.

కణ్వాశ్రమంలో ప్రవేశిస్తున్న దుష్యంతునికి శుభశకునము లైనట్లు పోతన్నగారు చిత్రించారు. ఇక్కడ కూడా ఆయన నన్నయ్య గారిని మనస్సులో పెట్టుకొనే ఈ క్రింది అందమైన కందాలు వ్రాశారు.

ఇందిందిరాతిసుందరి
యిందిందిర చికుర యున్న దిందంద శుభం
బిం దిందువంశ! యను క్రియ
నిందీవరవీథి మ్రోసె నిందిందిరముల్. **9-603**

తుమ్మెదల ఝుంకారాలే కాదు; కోకిలకూజితాలు కూడా దుష్యంతుడికి సంతోషాన్ని చేకూర్చేవిగా ఉన్నాయిట-

మా కందర్పుని శరములు
మా కందము లగుటఁజేసి మా కందంబుల్
మా కందములను కైవడి
మాకందాగ్రములఁ బికసమాజము నిలిచెన్. **9-604**

శకుంతల దుష్యంతునికి స్వాగత మివ్వటం కూడా ఎంతో అందంగా చెప్పారు పోతన్నగారు.

నీ వారము ప్రజ మేమును;
నీ వారము పూజగొనుము! నిలువుము! నీవున్
నీ వారును మా యింటను
నీవారాన్నంబు గొనుఁడు; నేఁడు నరేంద్రా! **9-618**

దాహార్తుడైన చండాలునికి తన దగ్గర ఉన్న కొంచెము నీళ్లు దానం చేస్తున్న కారుణ్యమూర్తి రంతిదేవుని పలుకులు ఎంతో సహజంగా ఉన్నాయి.

అన్నము లేదు; కొన్ని మధురాంబువు లున్నవి త్రావు మన్న! రా
వన్న! శరీరధారులకు నాపద వచ్చిన వారి యాపదల్
గ్రన్నన మాన్చి వారికి సుఖంబులు సేయుట కంటె నొండు మే
లున్నదె? నాకు దిక్కు పురుషోత్తముఁ డొక్కఁడు సుమ్ము పుల్కసా! **9-647**

ఈ విధంగా నవమస్కంధం నిండా నవనవ పరిమళాలు వెదజల్లే నవమల్లికలూ నల్లకలువలూ కొల్లలు కొల్లలుగా వెల్లివిరిశాయి. స్కంధాంతంలో సొంత గొంతుకతో పోతన్న గారు ఇలా ఆకాంక్షిస్తారు.

నగుమొగమున్, సుమధ్యమును, నల్లని దేహము, లచ్చి కాట ప
ట్టగు నురమున్, మహాభుజము, లంచితకుండల కర్ణముల్, మదే
భగతియు, నీలవేణియుఁ, గృపారసదృష్టియుఁ గల్గు వెన్నుఁ డి
మ్ముగఁ బొడసూపుఁగాతఁ గనుమూసిన యప్పుడు విచ్చు నప్పుడున్. 7-732

సహజసుందరమైన సహజపాండిత్యుని భాగవతం అక్షరాస్యు లందరికీ అందుబాటులో ఉండే నిమిత్తం సరళభావార్థ సహితంగా ప్రకటితం కావటం ఆంధ్రులందరికీ ఆనందకరమైన విషయం. ఈ సదుద్దేశంతోనే పోతన భాగవతం ప్రాజెక్టు ప్రారంభ మయింది. ఈ సందర్భంలో అనువాదభాగా లన్నింటినీ పరిశీలించి పరిష్కరించి ఏకసూత్రత కల్పించే కార్యం నాకు అప్పగించినందుకు కార్య నిర్వహణాధికారి శ్రీ సి. హెచ్. వేంకటపతిరాజు, ఐ.ఏ.ఎస్. గారికీ, డాక్టర్ రావుల సూర్య నారాయణమూర్తి (పి.ఆర్.ఓ.) గారికీ, ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు గారికీ నా సాధువాదాలు.

ఈ నవమస్కంధాన్ని మనోహరమైన సరళగద్యంలో అనువదించిన వారు శ్రీ బి. భాస్కరచౌదరి గారు. వీరు అనంతపురం ప్రభుత్వ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేయుచున్నారు. వీరి అనువాదం సహజంగా సరళంగా అన్యూనాతిరిక్తంగా సాగింది.

ఈ గ్రంథాన్ని ఇంత ముచ్చటగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్‌మేనేజర్ శ్రీ యం విజయకుమార్ రెడ్డిగారికి, వారి సిబ్బందికి నా శుభాశీస్సులు, అక్షర దోషాలు దొర్లకుండా సహస్రాక్షులై ప్రూపులు సరిదిద్దిన పూజ్యమిత్రులు మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికి నా ధన్యవాదాలు. ప్రెస్‌కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ ఎం.ఏ., ఎం.ఫిల్ కు నా శుభాకాంక్షలు.

భవదీయుడు
కరుణశ్రీ
ప్రధాన సంపాదకుడు
పోతన భాగవతం